క్లుప్తంగా...

అభినందనలు



ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లను అభినందిస్తున్న సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ రూపేశ్

సంతోష్‌నగర్: వినాయక నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా కనుల పండువగా ముగిసేందుకు ఎంతో కృషి చేసిన సౌత్, ఈస్ట్ జోన్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లకు శనివారం సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్ రూపేశ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిగా ఆదివారం నిర్వహించే మిలాద్–ఉన్–నబీ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఏసీపీలు మహ్మద్ గౌస్, మనోజ్ కుమార్, వెంకన్న నాయక్, ఇన్‌స్పెక్టర్లు పూసపాటి శివచంద్ర, మల్లేష్, సునిల్, శ్రీనివాస్, ప్రకాశ్‌రెడ్డి, రాఘవేంద్ర, గురునాథ్, షాకేర్ అలీ, శేఖర్ రెడ్డి, కోటేశ్వర్ రావు, చంద్రమౌళి ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



కృష్ణయాదవ్‌తో పాటు బీజేపీలో చేరిన లాల్‌దర్వాజా నాయకులు

చాంద్రాయణగుట్ట: మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్‌తో పాటు పాతబస్తీ లాల్‌దర్వాజాకు చెందిన నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో శనివారం కృష్ణాయాదవ్‌తో పాటు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పోసాని సదానంద్ ముదిరాజ్, లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పోసాని సురేందర్ ముదిరాజ్, బద్రీనాథ్‌గౌడ్ తదితరులు చేరారు.

వైద్యుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తాం



డాక్టర్ టి.వి.శ్రీనివాస్



డాక్టర్ అర్జున్ రాజ్

సుల్తాన్‌బజార్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులుగా కాచిగూడ న్యూరో హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గాంధీ ఆస్పత్రి ప్రముఖ వైద్యుడు డాక్టర్ అర్జున్‌రాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఐఎంఏ సిటీ బ్రాంచ్ అధ్యక్షుడిగా టీవీ.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అర్జున్ రాజ్ బాధ్యతలు చేపట్టారు. వారు మాట్లాడుతూ..సమాజంలో వైద్యుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కరోనా కష్టకాలంలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో కరోనా నివారణ కోసం డాక్టర్ అర్జున్ సలహాలు తీసుకోవడం ఐఎంఏకు గర్వకారణమన్నారు.

సాహిత్య పురస్కారానికి వెంకటరత్నం ఎంపిక




సుల్తాన్‌బజార్: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు తమ గురువు, నెల్లూరు వెంకటగిరి రాజా కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులైన పోలూరి హనుమజ్జానకీ రామ శర్మ స్మారకార్థం నెలకొల్పిన సాహితీ పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ సాహితీవేత్త గుంజి వెంకటరత్నంకు ప్రదానం చేయాలని తెలంగాణ సారస్వత పరిషత్ నిర్ణయించింది. అక్టోబర్ 13న సాయంత్రం 5:30 గంటలకు పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగే సభలో ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు, గన్నమరాజు గిరిజా మనోహర్‌బాబు ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

'పార్టీల గుర్తులు మార్చేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు'



సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర అధికార పార్టీ చిన్న పార్టీలకు ఎలక్షన్ కమిషన్ కేటాయించిన గుర్తులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుందని, బీఆర్‌ఎస్ పార్టీ తమ కారు గుర్తునే మార్చుకోవాలని యుగ తులసి పార్టీ జాతీయ అధ్యక్షుడు శివకుమార్ పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..గతంలో రోడ్డు రోలర్ గుర్తుతో మునుగోడులో పోటీ చేశానని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తమ గుర్తును తీసేందుకే ప్రయత్నిస్తుందన్నారు. ఈ విషయమై ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. చంద్రస్వామి, సంఘమేశ్వర చారి, ఆది వేణుగోపాల్, మహీర్, ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు



చార్మినార్: మిలాద్–ఉన్–నబీ ఉత్సవాలను పురస్కరించుకొని పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ దారి మళ్లింపు ఉంటుందని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. ఈ ట్రాఫిక్ దారి మళ్లింపు ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు.

- సయ్యద్ ఖాద్రీ చమాన్, గులాం ముర్తుజా కాలనీ నుంచి ఊరేగింపు ప్రారంభమైనప్పుడు షంషీర్‌గంజ్, ఇంజన్‌బౌలి ప్రాంతాల నుంచి వాహనాలను అనుమతించకుండా మహబూబ్‌నగర్ ఎక్స్ రోడ్డు, కందికల్‌గేట్, పిసల్‌బండ, పాత కర్నూల్ రోడ్డు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు సయ్యద్ ఖాద్రీ చమాన్, గులాం ముర్తుజా కాలనీ చేరుకున్నప్పుడు 15 నిమిషాల ముందు ట్రాఫిక్ గోశాల వద్ద మళ్లించబడుతుందన్నారు. షంషీర్‌గంజ్, ఇంజన్‌బౌలి వైపు ట్రాఫిక్ అనుమతించరన్నారు. బహదూర్‌పురా నుంచి కాలాపత్తర్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను అనుమతించకుండా కాలాపత్తర్ వై జంక్షన్ వద్ద అలీనగర్, జహనుమా వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ప్రధాన ఊరేగింపు టెయిల్ ఎండ్ ఇంజన్‌బౌలి చేరుకున్నప్పుడు మహబూబ్‌నగర్ ఎక్స్ రోడ్డు నుండి ట్రాఫిక్ విడుదల చేయబడుతుందని..అదే ఇంజన్‌బౌలి వద్ద గోశాల వైపు, అలాగే సయ్యద్ ఖాద్రీ చమాన్ రోడ్డు వైపు మళ్లించబడుతుందన్నారు. ట్రాఫిక్ నాగులచింత, చార్మినార్ వైపు అనుమతి ఉండదన్నారు.
- ఊరేగింపు షంషీర్‌గంజ్‌కు చేరుకున్నప్పుడు ట్రాఫిక్ షంషీర్‌గంజ్ వద్ద మళ్లించబడుతుందని.. ఊరేగింపు వెనుక చార్మినార్ వైపు అనుమతించకుండా గోశాల, కాలాపత్తర్, బహదూర్‌పురా ప్రాంతం వైపు మళ్లించబడుతుందన్నారు.
- ఊరేగింపు షంషీర్‌గంజ్‌కు చేరుకున్నప్పుడు లాల్‌దర్వాజా మోడ్ నుంచి ట్రాఫిక్ అనుమతించకుండా లాల్‌దర్వాజా, ఛత్రినాక వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నప్పుడు డెక్కన్ హోటల్, అక్కన్న మాదన్న ఆలయం, అశోక్ స్తంభం, మహ్మద్ షుకూర్ మసీదు మీదుగా సుధా లైబ్రేరి వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు టెయిల్ ఎండ్ లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నప్పుడు ఊరేగింపు వెనుక నాగులచింత వద్ద ట్రాఫిక్ మూసి వేయబడుతుందని.. సుధా లైబ్రేరీ, అశోక్ పిల్లర్, మహ్మద్ షుకూర్ మసీదు వైపు దారి మళ్లించబడుతుందన్నారు.
- ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నప్పుడు హిమ్మత్‌పురా, రాజేశ్ మెడికల్ హాల్ వద్ద ట్రాఫిక్ మూసి వేయబడుతుందని.. అక్కన్న మాదన్న ఆలయం, ఓల్గా హోటల్, ఖిల్వత్ వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్‌కు చేరుకున్నప్పుడు ఫతేదర్వాజా నుంచి ఖిల్వత్ నుంచి రాజేశ్ మెడికల్ ఖూల్/హిమ్మత్‌పురా వైపు ట్రాఫిక్ అనుమతించబడదన్నారు. ఓల్గా హోటల్ వద్ద ఫతేదర్వాజా, ఖిల్వత్ వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు రాజేశ్ మెడికల్ హాల్, శాలిబండకు చేరుకున్నప్పుడు పంచమోహల్లా వద్ద ట్రాఫిక్ అనుమతించబడదని.. షా ఫంక్షన్ హాల్ వద్ద ఖిల్వత్ రోడ్డు వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు నారాయణ స్కూల్ (చార్మినార్)కి చేరుకున్నప్పుడు ట్రాఫిక్ చార్మినార్ వైపు అనుమతించకుండా రాజేశ్ మెడికల్ హాల్ వద్ద నుంచి ఖిల్వత్, అక్కన్న మాదన్న దేవాలయం, మొగల్‌పురా వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు మక్కా మసీదు నుంచి వెళ్లినప్పుడు కాలికమాన్ నుంచి గుల్జార్‌హౌజ్ వైపు ట్రాఫిక్ అనుమతించకుండా అర్మాన్ హోటల్ వద్ద ఎతేబార్ చౌక్ వైపు మళ్లించబడుతుందన్నారు. మరోవైపు షీర్ బాతిల్ కమాన్ (ఘాన్సీబజార్) నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గుల్జార్‌హౌజ్ వైపు అనుమతించకుండా షీర్ బాతిల్ కమాన్ కింద మిట్టికా షేర్, ఘాన్సీబజార్ వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు చార్‌కమాన్ చేరుకున్నప్పుడు మదీనా నుంచి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను అనుమతించకుండా మదీనా వద్ద సిటీ కాలేజీ వైపు దారి మళ్లించనున్నామన్నారు.
- ఊరేగింపు చార్‌కమాన్ చేరుకున్నప్పుడు షెర్టన్ హోటల్ లేన్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ప్రధాన రహదారి అంటే మచిలీకమాన్‌లోకి అనుమతి ఉండదన్నారు. అదే సమయంలో అగర్వాల్ కమాన్ నుంచి వచ్చే ట్రాఫిక్ అగర్వాల్ కమాన్ వద్ద నిలిచిపోతుందన్నారు.
- టెయిల్ ఎండ్ గులాజర్‌హౌజ్‌కు చేరుకున్నప్పుడు కాలికమాన్, ఎతేబార్‌చౌక్, షీర్ బాతిల్ కమాన్ (ఘాన్సీబజార్) వైపు ట్రాఫిక్ అనుమతించబడుతుందని.. మదీనా వైపు అనుమతి ఉండదన్నారు.
- ఊరేగింపు మచిలికమాన్‌కు చేరుకున్నప్పుడు ఎంఎం సెంటర్ వద్ద ట్రాఫిక్ మూసి వేయబడుతుందని.. అఫ్జల్‌గంజ్ వంతెన వద్ద దారి మళ్లించబడుతుందన్నారు.
- ఊరేగింపు పిస్తాహౌజ్‌కు చేరుకున్నప్పుడు అక్కన్న మాదన్న ఆలయం నుంచి మొఘల్‌పురా, బీబీబజార్ వైపు ట్రాఫిక్ అనుమతి ఉండదన్నారు. హఫీజ్‌ఢంకా మసీదు, అశోక్ పిల్లర్, రాజేశ్ మెడికల్ హాల్ వైపు దారి మళ్లించబడుతుందన్నారు. మరోవైపు మొఘల్‌పురా నుంచి వచ్చే ట్రాఫిక్‌ను మీర్‌కా దాయారా నుంచి మొఘల్‌పురా వైపుగా గౌలిపురా రోడ్డు మీదుగా ఊరేగింపు ముగిసే వరకు దారి మళ్లిస్తారన్నారు.
- ఊరేగింపు బీబీబజార్‌కు చేరుకున్నప్పుడు ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్‌ను మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ రోడ్డు వైపు మళ్లించే వరకు.. తలాబ్‌కట్టా నుంచి ఓల్గా హోటల్‌కు ట్రాఫిక్ అనుమతి ఉండదన్నారు.

బండ్లగూడలో 'డబుల్' లబ్ధిదారుల జాతర



ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు బారులు తీరిన లబ్ధిదారులు

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ మండల కార్యాలయం వద్ద డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులతో శనివారం జాతరను తలపించింది. లక్కీడ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు ఫోన్ చేసి అవసరమైన పత్రాలు తీసుకురావాలని సమాచారం ఇవ్వడంతో ఉదయం 10 గంటల నుంచి బారులు తీరారు. ఆధార్ కార్డులు, ఫొటోలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకొని అధికారులకు అందజేసి టోకెన్ నంబర్లను పొందారు. ఆయా టోకెన్ల ఆధారంగా పట్టాల నంబర్లను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఫోన్లు రాని వారు చాలా మంది గోడకు అంటించిన జాబితాలో తమ పేర్లను వెతుకుతూ కనిపించారు. అర్హత పొందిన మరికొందరు తమ పేర్లను లక్కీడ్రాలో వెళ్లాయా..? లేవా..? అంటూ రెవెన్యూ సిబ్బంది వద్ద ఫోన్ లాగినై వివరాలు తెలుసుకున్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధికి వచ్చే ఈ మండలంలో ఇప్పటి వరకు 1845 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలు 300లుగా ఉన్నారు. ఇదిలా ఉండగా జాబితాలో పేర్లు లేని దరఖాస్తుదారులు నిరాశతో వెనుదిరిగారు.

మెట్రోరైల్ సాధనకు పోరాటాలు ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: పాతబస్తీలో వెంటనే మెట్రోరైల్ పనులు ప్రారంభించాలని లేని పక్షంలో మెట్రోరైల్ సాధనకు పోరాటాలు ఉధృతం చేస్తామని పాతనగర మెట్రోరైల్ జేఏసీ నేతలు హెచ్చరించారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జేఏసీ నేతలు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ.నర్సింహ, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదదేవి, టీపీసీసీ కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఉస్మాన్‌బిన్ మొహమ్మద్ అల్ హాజరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్, టీటీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవీంద్రచారి మాట్లాడారు. పాతనగరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెట్రోరైల్ పనులు ప్రారంభించకపోతే అక్టోబర్ మొదటి వారంలో ప్రతిపాదిత ఫలక్‌నుమా మెట్రో రైల్ డిపో వద్ద వేలాది మందితో భారీ ధర్నా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.ఓల్డ్‌సిటీ మెట్రో కనెక్టివిటీ విస్తరణను తక్షణమే ప్రారంభిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడం, రూ.500 కోట్లు కేటాయించడం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు ఎందుకు పనులు ప్రారంభించలేదన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రోరైల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మలక్‌పేట్‌లో మెట్రో వచ్చిందని, అది పాతబస్తీ అని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో సయ్యద్ సలీం, ముసా ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలకు గట్టి బందోబస్తు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీవీ ఆనంద్

చార్మినార్: మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను పురస్కరించుకొని పాతబస్తీతో పాటు నగరంలోని అన్ని ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకొని శనివారం సాయంత్రం ఆయన అన్ని జోన్ల డీసీపీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇప్పటికే వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కృషి చేసిన సంబంధిత పోలీసు అధికారులకు అభినందనలు తెలిపారు. మిలాద్ ఉన్ నబీ వేడుకలు సైతం శాంతియుత వాతావరణంలో ఆనందంగా కొనసాగేలా తగిన చర్యలు తీసుకోవాలని డీసీపీలను ఆదేశించారు. ముఖ్యంగా దక్షిణ మండలంలోని చార్మినార్, గుల్జార్‌హౌజ్, మొఘల్‌పురా ప్రాంతాల్లో నిర్వహించే సామూహిక ఊరేగింపునకు తగిన బందోబస్తు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయన్నారు. సమావేశంలో అడిషనల్ సీపీ (లా అండ్ ఆర్డర్) విక్రమ్‌సింగ్ మాన్, అడిషనల్ సీపీ (స్పెషల్ బ్రాంచ్) విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



నాంపల్లి: రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్, రేడియోగ్రాఫర్స్, ఈఈజీ, ఈసీజీ టెక్నీషియన్స్, ఫార్మసిస్టులు, నాల్గవ తరగతి ఉద్యోగులు, డాటా ఎంట్రీ ఆపరేటర్స్ కలిసికట్టుగా శనివారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. అధిక సంఖ్యలో హాజరైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి నినాదాలు రేకెత్తించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఆందోళన చేపట్టారు. జీఓ నెం–4271 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మూడేళ్ల పని చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పే అండ్ అకౌంట్ శాఖ నుంచి జీతాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని వారు హెచ్చరించారు.

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి



అధికారులతో కలిసి పర్యటించిన బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని ఎంజేమార్కెట్, పరిసర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో గోషామహల్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ప్రకాశం, వాటర్‌బోర్డు డీజీఎం జగదీశ్, జీహెచ్‌ఎంసీ డివిజనల్ ఇంజినీర్ వెంకన్న, మేనేజర్ మధుసుదన్‌చారి, ఏఈ వేణుగోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు నందుకుమార్, బస్తీ నాయకులు ప్రకాష్, సత్యనారాయణ, భజన్‌సింగ్, ఉమర్, నరేష్, రాము, నాగేష్, బాబు, కిట్టు, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువుల ఉత్పత్తిపై అవగాహన



కేశవ్‌సోని

అబిడ్స్: స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్వదేశీ వస్తువులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్వదేశీ జాగరణ్ మంచ్, తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్‌సోని పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..సీసీఆర్‌టీ మాదాపూర్‌లో ఆది, సోమవారాల్లో ఈ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. స్వావలంబి భారత అభియాన్, స్వదేశీ వస్తువుల ఉత్పత్తి, వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్వదేశీ ప్రాముఖ్యత, చిరుధాన్యాల వినియోగం, సేంద్రీయ వ్యవసాయ ప్రోత్సాహం లాంటి విషయాల పట్ల ప్రజల్లో అవగాహన చేపడుతామన్నారు. సైద్ధాంతిక అంశాల పట్ల సవివరమైన చర్చతో పాటు పలు అంశాల పట్ల ప్రస్తావన చేపడుతామన్నారు.

వేడుకలను శాంతియుతంగా నిర్వహించాలి



పీస్ కమిటీ సభ్యులతో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

అబిడ్స్: మిలాద్–ఉన్–నబీ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలని అబిడ్స్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు పేర్కొన్నారు. పీస్ కమిటీ సభ్యులతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం నర్సింహారాజు మాట్లాడుతూ..మిలాద్–ఉన్–నబీ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో కొనసాగాలని సూచించారు. ముస్లింలకు మైత్రి సభ్యులతో పాటు పాటు స్థానికులంతా సహకరించి ఉత్సవాలు జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణ, సెక్టర్ ఎస్ఐ.సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

స్థానికులకే 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

అబిడ్స్: ధూల్‌పేటలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్‌లను ధూల్‌పేట్ వాసులకే ఇవ్వాలని మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ పేర్కొన్నారు. నగర జాయింట్ కలెక్టర్ మధుసుదన్‌కు, గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం.కృష్ణతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..గుడుంబ మానివేసిన వారందరికీ ధూల్‌పేట్‌లో డబుల్‌బెడ్‌రూమ్‌లు కేటాయించాలన్నారు. గతంలో తాము పలుమార్లు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. గుడుంబ మానివేసిన ప్రత్యామ్నాయదారులకు వెంటనే డబుల్‌బెడ్‌రూమ్‌లు కేటాయించనిచో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శశికళ, బీజేపీ కన్వీనర్ కృష్ణ

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ, కేరళ రాష్ట్రాల సంస్కృతి, ప్రాచీన కాలం నుంచి కొనసాగుతుందని కేరళ రాష్ట్ర మంత్రి అహ్మద్ దేవర్ కోవిల్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో మూడు రోజుల పాటు జరుగనున్న కేరళ, తెలంగాణ హెరిటేజ్ ఫెస్టివల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేరళ భవన్ కోసం ఎకరం స్థలాన్ని కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 5 లక్షల మంది కేరళ వాసులు తెలంగాణ సంస్కృతిని కొనసాగిస్తున్నారని తెలిపారు. అనంతరం ఇరు రాష్ట్రాల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్, సంగీత నాటక అకడమి చైర్మన్ దీపికారెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేరళ రాష్ట్ర ప్రతినిధులు ఉన్ని కృష్ణన్ బెజ్జిమెన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీల్లో పర్యటిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కార్పొరేటర్ వసీవుద్దీన్ తదితరులు

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులను చేపట్టనున్నామని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. రెయిన్‌బజార్ డివిజన్‌లో రూ.8.69 కోట్ల అభివృద్ధి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఆయన యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మురికి నాలా, సివరేజ్, డ్రైనేజీ, వర్షపు నీటి, సీసీ, బీటీ నాలా విస్తరణ అభివృద్ధి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టనున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న మరో రూ.70 లక్షల అభివృద్ధి పనులు సైతం త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ప్రతిపాదించిన మెట్రోరైలు నిర్మాణ పనులు ఇప్పటికే సంబంధిత అధికారులు సర్వే చేపట్టారన్నారు. గుల్జార్‌హౌస్ వాటర్ ఫౌంటెన్ పునర్నిర్మాణ పనులు పూర్తవగానే మంత్రి కేటీఆర్‌తో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్, ప్రాజెక్టు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



విజయనగర్‌కాలనీ: టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ యూసుఫ్‌కు ఎస్ఐగా పదోన్నతి లభించింది. శనివారం ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్‌యూసుఫ్‌కు స్టార్‌ను ధరింపజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎస్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దు



సాలర్‌జంగ్ కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని సాలర్‌జంగ్ కాలనీ, నిజాం కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయనను స్థానికులు కలిసి అక్కడ జరుగుతున్న పనులు మరినెమ్మదిగా జరుగుతున్నాయని ఆయనకు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో ఒకేసారి సుమారు రూ.300 కోట్ల మోడ్రన్ డ్రైనేజీ లైన్ పనులు జరుగుతున్నాయి. అయితే ఒక్కో ప్రాంతంలో ఒక్కో కాంట్రాక్టర్‌కు ఈ పనులు అప్పగించడం జరిగిందని, పనులు త్వరగా పూర్తి కావాలన్నదే ఉన్నతాధికారుల ఆలోచన అని ఆయన అన్నారు. నానల్‌నగర్, టోలిచౌకి, గోల్కొండ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ లైన్ పనులను తాను వారానికి రెండు సార్లు పరిశీలిస్తున్నామని అన్నారు. టోలిచౌకి–సెవన్ టూంబ్స్ రోడ్డు, టోలిచౌకి చౌరస్తా, ఎండీ లైన్స్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని ఆయన అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, డాక్టర్ నీయాజ్ అహ్మద్ ఖాన్ తదితరులున్నారు.

'విద్యార్థినులకు సంస్కృతి సంప్రదాయాలను బోధిస్తున్నాం'



విద్యార్థినులతో జీఎన్ఐటీఎస్ చైర్మన్ రాఘవరెడ్డి

గోల్కొండ: విద్యాబుద్ధులతో పాటు విద్యార్థినులకు భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను సైతం బోధిస్తున్నామని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రాఘవరెడ్డి అన్నారు. శనివారం వినాయక చవితి సందర్భంగా సంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కె.రమేష్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించాలి

గన్‌ఫౌండ్రీ: చిన్నారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించడంతో పాటు వారిలో సృజనాత్మక శక్తి పెంపొందేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ సీఈఓ మదన్ తెలిపారు. ఇటీవల తమ ప్రతిభతో జాతీయస్థాయి అవార్డులు అందుకున్న అక్కాచెల్లెళ్లు ఆర్.సంజన, శాన్వికను శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..చిత్రలేఖనం, సాంకేతిక రంగాల్లో అద్భుత ప్రతిభను కనబరుస్తూ జాతీయ పురస్కారాలు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 8వ తరగతి చదువుతున్న సంజన భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ రమణి, ఉపాధ్యాయురాలు సూర్య అర్చన పాల్గొన్నారు.



సంజన, శాన్వికలను అభినందిస్తున్న సీఈఓ మదన్ తదితరులు

మౌలిక సదుపాయాలు కల్పించాలి



విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని శనివారం రిజిస్ట్రార్ కొడాలి సుందర్‌కుమార్‌కు హాస్టల్ విద్యార్థులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అబిడ్స్ ప్రాంతంలో నిర్వహింపబడుతున్న యూనివర్సిటీ హాస్టల్‌లో తాగునీళ్లు రాకపోవడంతో విద్యార్థులు ఉదయాన్నే హాస్టల్ నుంచి బయల్దేరి మాసబ్‌ట్యాంక్‌లోని యూనివర్సిటీ ప్రాంగణానికి వచ్చి అక్కడ ఆరుబయట ముఖాలు కడుకున్ని స్నానాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ..సంబంధిత అధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

అందరి సహకారంతో వినాయక నిమజ్జనం ప్రశాంతం



గోల్కొండ కోట వద్ద జరిగిన కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు

గోల్కొండ: అందరి సహకారంతోనే వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని గోల్కొండ పీస్ కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి ఆబీద్, ఇలియాస్ అలీ అన్నారు. శనివారం గోల్కొండ కోట చౌరస్తా వద్ద పీస్ అండ్ మైత్రి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లిం, హిందువుల పండగలు ఒకేరోజు వచ్చాయని అయినా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. వినాయక నిమజ్జన ఊరేగింపులో పోలీసులకు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు తమవంతు తోడ్పాటు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరుద్దీన్, ఆజామ్ ఖాన్, తహసీన్ పాషా, ఏ.పరమానందం, నర్సింగ్, చాంద్‌బాయ్ తదితరులున్నారు.